సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి

గోల్నాక, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజార్టీతో విజయం సాధించి పార్టీ జెండాను ఎగరవేయడం ఖాయమని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబర్‌పేట ఛె నెంబర్‌లోని మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం బూత్‌స్థాయి కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో డాక్టర్ రోహిణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధిస్తే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.



దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నగర నాయకులు నాయుడు రవి



మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి

ముషీరాబాద్, అంబర్‌పేటలో ప్రచారం...

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. అడిక్‌మెట్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు తిరుమల్ ఆధ్వర్యంలో వడ్డెరబస్తీ, అంజయ్యనగర్, పోచమ్మబస్తీ తదితర ప్రాంతాలలో జరిగిన ఎన్నికల ప్రచారానికి ఎన్నికల ఇన్‌చార్జిలు ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్, గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరై కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓట్లు వేసి నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ గెలిస్తేనే అభివృద్ధి పథకాలు అమలవుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకుడు మనోహర్, వడ్డెర సంఘం నాయకులురమేష్, నాయాకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దానం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక...

ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయుడు రవి తన అనుచరులతో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు నాగేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయుడు రవి మాట్లాడుతూ దానం నాగేందర్ గెలుపేలక్ష్యంగా పనిచేస్తానన్నారు.

గోల్నాక డివిజన్‌లో...

గోల్నాక, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ మార్పుతో కూడిన ప్రజాపాలనను కొనసాగిస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే గ్యారంటీలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను అందజేస్తూ ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాని నేతలు ప్రజలను కోరారు.

కవాడిగూడలో...

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు



దానం నాగేందర్ విజయాన్ని కాంక్షిస్తూ గోల్నాక డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలు

చేస్తున్న ఆరు గ్యారంటీలను ఇంటింటికి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా శుక్రవారం కవాడిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, నగర నాయకులు పి.లక్ష్మణ్. సూర్యచంద్రశేఖర్, అంజయ్యగౌడ్, పార్టీ నేతలు కవాడిగూడ బీమా మైదాన్ నుంచి డీబీఆర్ మిల్ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సాయిబాబు. ఆర్.కె శ్రీనివాస్‌ముదిరాజ్, నర్సింగ్, సంజయ్‌సింగ్, వెంకట్‌రెడ్డి, దశరథ్, నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో...

చిక్కడపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు గాంధీనగర్ డివిజన్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ పర్యవేక్షణలో కంటెస్టెడ్ కార్పొరేటర్ గుర్రచంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా పార్టీ ఎన్నికల కరపత్రాలను ఓటర్లకు ఇచ్చి ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో చేతిగుర్తుపై ఓటు వేసి నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సంజయ్ నగర్, జనప్రియ, రైజింగ్ లిరిక్స్, కదమ్ టవర్స్, మెహతా టవర్స్ బ్లూబెల్స్ అపార్ట్‌మెంట్‌లలో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం తప్పదు

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగుచెందుతున్న ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెబుతారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బీఎస్పీకి చెందిన సీనియర్ నాయకులు కె.ఎల్ సత్యనారాయణ, భాస్కర్, వెంకటరమణ, చుక్కా బాలనర్సింహ, నర్సింగ్‌రావు తదితరులు ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న రాజీలేని పోరాటాలను చూసి స్వచ్ఛందంగా ఇతర పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



బాకారంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు



కాచిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయండి

గోల్నాక, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి శక్తి వంచన లేకుండా పని చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ గోల్నాక డివిజన్ బూత్‌కమిటీల సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని ప్రసంగిస్తూ పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశనం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు భారీ మెజారిటీ అందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ మహంకాళి జిల్లా కన్వీనర్‌గా కృష్ణారావు

బర్కత్‌పుర, మే 3(ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణారావు బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ మహంకాళి జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి. శ్యాంసుందర్‌గౌడ్ శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రిటైర్డ్ ఉద్యోగులను కలిసి బీజేపీకి ఓటు వేయాలని విన్నవిస్తానని ఆయన పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఆదిశ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మహేందర్, దశరథం

పనిచేస్తున్నవారికే కార్పొరేషన్ పదవులివ్వాలి

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): పదిహేను సంవత్సరాలుగా మున్నూరు కాపుల సంక్షేమానికి పనిచేస్తున్నవారికే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్, సభ్య పదవులివ్వాలని కోరుతూ తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలో ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆరె దశరథం, మహేందర్‌లు మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘాల బాధ్యులను గుర్తించి అవకాశాలు కల్పించాలని కోరినట్లు వివరించారు. సీఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకుపోవాలని కోరామన్నారు. కాగా ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో కూడా మున్నూరుకాపులకు సముచిత స్థానం దక్కేవిధంగా ప్రభుత్వ పక్షాన కృషి చేయాలని విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.



దిడ్డి రాంబాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రజక సంఘం నేతలు

కాంగ్రెస్ పార్టీలో చేరిన రజక సంఘం నాయకులు

బర్కత్‌పుర, మే 3 (ఆంధ్రజ్యోతి): నారాయణగూడ శివాజీనగర్ దోబీఘాట్‌లోని రజక సంఘం అధ్యక్షుడు రాజేష్‌లాల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దిడ్డి రాంబాబు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రజా పాలన పట్లప్రజలు సంతోషంగా ఉన్నారని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో గణేష్‌సింగ్, ప్రదీప్, నర్సింగ్‌రావు, రాజులాల్, వినోద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కాంగ్రెస్ పార్టీకి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణ కోసం ఇండియా కూటమి భాగస్వామి కాంగ్రెస్ పార్టీకి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు తెలుపుతున్నట్లు ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. దిడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ నిరంకుశ పాలనలో దేశంలో విధ్వంసం జరిగింది తప్పా అభివృద్ధి ఎక్కడ లేదని విమర్శించారు. అసహనం, అశాంతి, నిరుద్యోగం, అధిక ధరలతో దేశ ప్రజల జీవన పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ ఏమి చేశాడని చెప్పక ఓటమి భయంతో అసహనానికి గురవుతూ స్థాయి దిగజారి విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశానికి ప్రధానిగా ఉన్న విషయాన్ని మరచిపోయి మోదీ ఒక మతానికి ప్రతినిధిగా మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. సమావేశంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, డాక్టర్. సాల్మన్‌రాజ్, డాక్టర్. అన్సారీ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ ఆర్టీసీ డిపోలో శుక్రవారం లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి పి. అరుణ కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

సికింద్రాబాద్‌లో బీజేపీ విజయం తథ్యం

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మే 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ విజయం తథ్యం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనను సమర్థిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. ఈ నెల 10న ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరానికి వస్తున్నారని ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

నల్లకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎంపీగా నిరంతరం అపార్ట్‌మెంట్‌వాసులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్‌లోని మాతృశ్రీ స్కూల్ వీధి, ఇస్తరాకుల వీధి, శంకరమఠం సమీపంలోని సిరిసంపద అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ వై. అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్‌లతో కలిసి జి. కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కిషన్‌రెడ్డి అభ్యర్థించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి

● ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో పది సంవత్సరాల



కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో ప్రచారంచేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ, తదితరులు

కాలంలో ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే బీజేపీ గెలిపిస్తాయని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. మోసపూరిత కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 12 ఎంపీ సీట్లను బీజేపీ గెలిచితీరుతుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మనగర్‌లో డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మహిళల నుంచి విశేష స్పందనవచ్చిందని డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు.

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు కోసం కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ గాంధీనగర్ డివిజన్‌లో ప్రచారం చేశారు

ముషీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూసరాజు మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించి కోట్లాది రూపాయలు ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులకు విడుదల చేశారని పేర్కొన్నారు.

దళితులకు బీజేపీతోనే న్యాయం జరుగుతుందని, మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ బీజేపీనే చేస్తుందని ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ అన్నారు.

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్కజగన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి మాజీమంత్రి కృష్ణాయాదవ్ హాజరై కిషన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి నివేదికతో కూడిన పుస్తకం ఆవిష్కరించారు.

బ్యాడ్మింటన్‌లో ప్రణయ్, అలీషాకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఎంఎల్ఆర్ఐటీ షట్లర్లు ప్రణయ్, అలీషా నాయక్ సత్తా చాటారు. బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో అండర్-19 సింగిల్స్‌లో ప్రణ య్, అలీషా విజేతలుగా నిలిచి, స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కోచ్ భాస్కర్‌బాబు, ప్రణయ్, అలీషాను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న లక్ష్మణ్‌రెడ్డి

రేపు త్రోబాల్ సెలెక్షన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ సెలెక్షన్ ట్రయల్స్‌ను ఆదివారం నిర్వహించనున్నట్టు తెలంగాణ త్రోబాల్ సంఘం తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి సోమాజిగూడలోని విల్లా మేరీ డిగ్రీ కళాశాలలో ఈ ట్ర యల్స్‌ను నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 28నుంచి పటియాలలో జరగనున్న జాతీయ సబ్ జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేయనున్నారు. ట్రయల్స్‌లో పాల్గొనే వారి వయసు 15 ఏళ్లలోపు ఉండాలి. బాలబాలికలకు విడివిడిగా సెలెక్షన్స్ నిర్వహిస్తారు. మరిన్ని వివరాల కోసం ఈ ఫోన్ నెంబర్ (99487 77102)కు కాల్ చేసి తెలుసుకోవచ్చు.



అత్యవసర సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు

నేడు ఎమ్మార్పీఎస్ ధర్నా

పద్మారావునగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కేటాయించకుండా చేసిన అవమానాన్ని నిరసిస్తూ 4వ తేదీ శనివారం ఇందిరా పార్క్ వద్ద మాదిగల మహా ధర్నా నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టీవీ నరసింహ మాదిగ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాలులో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యవర్గం శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ జాబితాలో నుంచి మాదిగలను తొలగించినట్లుగా కాంగ్రెస్ పార్టీ అవమానపరచిందని అన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యతవహించాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరవుతారని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

● కాలిపోయిన కరెంట్ తీగలు

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆం ధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ బస్తీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద తీగలకు మంటలు అంటుకోవడంతో విద్యుత్ సరఫరాలో గంటన్నర పాటు అంతరాయం నెలకొంది. యూసుఫ్‌గూడ నుంచి ఆర్బీఐ క్వార్టర్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలొచ్చి విద్యుత్ తీగలు, ప్రైవేట్ కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయి. విష యం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి కాలిపోయిన తీగల స్థానంలో నూతన తీగలు వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయొద్దని బంజారాహిల్స్ డీఈ నరేందర్ రెడ్డి స్థానికులకు సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద చెత్త ఉందని ఆ చెత్తలో సిగరేట్ వేయడంతో మంటలు వచ్చి తీగలు కాలిపోయినట్టు ప్రాథమికంగా గుర్తిం చినట్టు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోలేదని, కాలిపోయిన తీగలు తొలగించి అదే ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్టు తెలిపారు.

అమీర్‌పేట ఏడీఈ ప్రేమ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఏడీఈ మల్లేశం విద్యుత్ సిబ్బందితో కాలిపోయిన విద్యుత్ తీగలు, ప్రైవేట్ తీగలు తొలగించి 4డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు, తీగల సమీపంలో బ్యాన ర్లు కట్టొద్దని స్థానికులకు అధికారులు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రతినిధులు

నాల్గవ తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి

● తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం

బర్కత్‌పుర, మే 3 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణలో నాల్గవ తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్‌లు కోరారు. శుక్రవారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో పార్ట్‌టైమ్, డైలీ వేజెస్, ఎన్ఎంఆర్‌లుగా 30 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ తక్కువ వేతనం ఇస్తున్నారని కనీస వేతనం 35 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. పదేళ్లుగా యూనిఫామ్ ఇవ్వడం లేదని, అయిదు ఇంక్రిమెంట్లను ఏడుకు పెంచాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను కొంగరకలాన్‌కు మార్చడం వల్ల 15 శాతం హెచ్ఆర్ఏ ఇస్తున్నారని, దీనినికొత్త పీఆర్‌ఎస్‌లో 30 శాతానికిపెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఖాదర్‌బిన్ హస్సేన్, పి.రాజేందర్, కృష్ణవేణి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకుల కోసం పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్‌లాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్. విజయలక్ష్మి, గురుసెవార్, విద్యాభూషన్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా అర్హతతో ఎస్ఎంటీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 150 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వీరికి వేతనం నెలకు రూ.16 వేలు ఉంటుందని తెలిపారు. ఐటీఐ అర్హతతో ఎస్ఎంటీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 220 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వీరికి వేతనం నెలకు రూ.15 వేలు ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ అర్హతతో ఎస్ఎంటీ ఆపరేటర్స్‌కు 180 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వీరికి నెలకు రూ.14 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని గరిష్ఠ వయో పరిమితి 33 సంవత్సరాల వయసు, ఆసక్తి గల వారు ఈ నెల 8వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9542433427, 9515658033 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాజ్యాంగేతర నియంతృత్వాన్ని ఓడించాలి

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగేతర నియంతృత్వాన్ని ఓడించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నయవంచన పదేళ్ల నిరంకుశ పాలన, పది దారుణ మోసాలు అనే పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన తెలకపల్లి రవి మాట్లాడుతూ నియంతృత్వం చేస్తున్న మోదీ పాలన విధ్వంసంగా ఉందన్నారు. బీజేపీ దేశ ప్రజలను మతం, ప్రాంతం విభజన తీసుకువచ్చి వారి హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్వీకే ట్రస్ట్ ప్రతినిధి వినయ్‌కుమార్, కె. ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనందించాలి

● అనాథపిల్లల మధ్య పుట్టినరోజు జరుపుకున్న ఇన్‌స్పెక్టర్

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): బలగం లేని అనాథలకు, అభాగ్యులకు చేయూతను అందించాల్సిన అవసరం ఉందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. శుక్రవారం నల్లకుంటలోని అనాథాశ్రమం సందర్శించి అనాథలకు నేనున్నా అంటూ వారిమధ్య తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి భోజనాలతోపాటు వారికి అవసరమైన వాటిగురించి అడిగి తెలుసుకున్నారు.